క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా...



మంత్రి ఆనంకు పూలమొక్క అందజేస్తున్న వీసీ సుందరవల్లి

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయయరెడ్డిని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంతపేటలోని నివాసంలో మంత్రిని కలిసి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మంత్రి ఆనంను వీఎస్‌యూ వీసీఎం జీఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ రామ చంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీఎస్‌యూ ప్రగతి, కోర్సుల వివరాలను మంత్రికి వివరించారు. వీఎస్‌యూ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని, అధ్యాపకులు, సిబ్బంది అందరూ సమిష్టిగా పనిచేసి మంచిపేరు తీసుకురావాలని మంత్రి సూచించారు.

మైపాడు, కొత్తకోడూరు బీచ్‌ల్లో గస్తీ ఏర్పాటు



నెల్లూరు సిటీ: ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ ఆదేశాల మేరకు జిల్లాలోని మైపాడు, కొత్తకోడూరు బీచ్‌ల వద్ద రక్షణాపరమైన పటిష్ట చర్యలు చేపట్టినట్లు కోవూరు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మైపాడు, కొత్తకోడూరు బీచ్‌ల వద్ద పర్యాటకుల రక్షణ, భద్రతలో భాగంగా మంగళవారం గస్తీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్‌ల వద్ద టూరిస్ట్ పోలీసు అవుట్‌పోస్టు సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



పొదలకూరు : శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా వెంకటసుబ్బారావు-రత్నమ్మ, మోహన్‌కుమార్-అలేఖ్య దంపతులు వ్యవహరించారు. దేవస్థానం నిర్వాహకులు వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం.శ్యాంప్రసాద్, కొమ్మి వేణుగోపాల్, దాసరి శ్రీనివాసులు, చొప్పా వెంకటేశ్వర్లు, మురళి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీరఅభయాంజనేయస్వామి, శివాలయం, ప్రభగిరిపట్నంలోని ఆంజనేయస్వామి దేవస్థానాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సతీమణి సోమిరెడ్డి జ్యోతమ్మ పూజలు చేశారు.

జాతీయ స్కాలర్‌షిప్‌కు పొదలకూరు విద్యార్థులు



చరిత్



నవదీప్

పొదలకూరు : గతేడాది డిసెంబర్ నెలలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షల్లో పొదలకూరు మండలం అమ్మవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాలకు చెందిన ఆర్వీ చరిత్, జి.నవదీప్ ప్రతిభ చూపి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. వీరికి కేంద్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాల పాటు ఏటా రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందజేయనుంది. ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులను పాఠశాల హెచ్ఎం విజయ్‌కుమార్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సురేంద్రకుమార్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులతో ఇవేం పనులు సారూ..





నగరంలోని కొండాయపాళెం గేట్ సమీపంలో చైల్డ్ అండ్ పోలీస్ క్యాప్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర వసతిగృహంలో విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాల్సిన నిర్వాహకులు వారితోనే పనులు చేయిస్తున్నారు. వసతిగృహంలో మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో సోమవారం వసతిగృహ గదుల్లోని విద్యార్థులకు సంబంధించిన సామగ్రిని వారితోనే బయటకు మోపించారు. చిన్నారులు మోయలేక మోయలేక బెడ్లను బయటకు తరలించారు. బాలలతో వెట్టిచాకిరీ నేరం..బాలలను బడికి పంపాలంటూ ఉపన్యాసాలు దంచే అధికారులే వారితో పనులు చేయించడాన్ని గమనించిన పలువురు ఇవేం పనులు సారూ అంటూ మండిపడుతున్నారు.

–సాక్షి, ఫొటోగ్రాఫర్

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య



చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న అంగన్‌వాడీలు



కపాడిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో..

నెల్లూరు సిటీ: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యలో భాగంగా మూడేళ్లు నిండిన చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందిస్తున్నట్లు అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీఓ అన్నపూర్ణ తెలిపారు. గాంధీనగర్ సెక్టార్ పరిధిలోని కల్లూరుపల్లి హెచ్‌బీ2 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్యాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రీస్కూల్ పూర్తి చేసుకున్న ఐదేళ్లు నిండిన చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన చిన్నారులను సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, డయేరియా నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీలు వసంతకుమారి, వి.విజయలక్ష్మి, తులసి, స్వాతి, ఆయాలు ప్రేమ, విజేత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఐసీడీఎస్ నెల్లూరు అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని రంగనాయకులపేట సెక్టార్‌లో ఉన్న కపాడిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రీస్కూల్ విద్యను పూర్తి చేసుకున్న ఐదేళ్లు నిండిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులను చేర్పించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం, చిన్నారులకు ప్రీస్కూల్ విద్య, డయేరియా వ్యాధి నివారణ చర్యలు, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వి.విజయలక్ష్మి, అంగన్‌వాడీలు శైలజ, సుబ్బరత్నమ్మ, లలిత, తదితరులు, పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీల్లో రత్నం విద్యార్థి సత్తా



నెల్లూరు (టౌన్): రాష్ట్ర జోనల్ స్థాయి స్కేటింగ్ పోటీల్లో డా.కిషోర్స్ రేస్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 5వ తరగతి విద్యార్థి సాయి మన్విత్ సత్తాచాటినట్లు రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు తెలిపారు. సరస్వతినగర్‌లోని రత్నం స్కూల్‌లో సాయిమన్విత్‌ను మంగళవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న తిరుపతిలో జరిగిన తొలి రాష్ట్ర జోనల్ స్థాయి పోటీల్లో సాయిమన్విత్ రింక్-2లో బంగారు, రింక్-3లో రజతం, రింక్-1లో కాంస్య పతకాలను సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలకు ఉద్యోగోన్నతి కల్పించండి



మాట్లాడుతున్న చేజర్ల సుధాకర్‌రావు

నెల్లూరు(అర్బన్): గ్రామీణ ప్రాంతాల్లో 30 ఏళ్లకుపైగా ప్రజలకు సేవలందిస్తూ ఉద్యోగ విరమణ చేయనున్న ఏఎన్‌ఎంలకు గెజిటెడ్ హోదా కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ సర్వీసెస్ (ఏపీ హంస) జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి)లో మంగళవారం నిర్వహించిన ఏఎన్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు అన్ని రకాల ఆరోగ్యసేవలు అందించేది ఏఎన్‌ఎంలేనని తెలిపారు. వారు ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఒకే రకమైన క్యాడర్‌లో ఎలాంటి ప్రమోషన్లు లేకుండా పనిచేస్తున్నారన్నారు. వారి పదోన్నతికి సంబంధించిన మాన్యువల్ కాన్ఫెన్షియల్ రిపోర్టు, డీపీసీ ప్రాసెస్‌లో ఉందన్నారు. ఆ ప్రక్రియ ఆలస్యం కావడం వల్ల ఎంతో మంది ఏఎన్‌ఎంలు తమ చిరకాల కోరికైన కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్లుగా ఉద్యోగోన్నతి పొందకుండానే ఉద్యోగ విరమణ చేస్తున్నారన్నారు. ఈ నెలాఖరుకు రాష్ట్ర వ్యాప్తంగా 10 మంది ఉద్యోగ విరమణ పొందుతున్నారన్నారు. ఇప్పటికే హంస రాష్ట్రాధ్యక్షుడు అరవపాల్ విషయాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ స్పందించి న్యాయం చేయాలని కోరారు. సంఘ నాయకులు మజహరుల్లా, జ్యోతి, వసంత, చెంచురామయ్య, వరలక్ష్మి, గౌస్‌బాషా, పృధ్వీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ చీకటి అధ్యాయం



నెల్లూరు(మినీబైపాస్): భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా విధించిన ఎమర్జెన్సీ ఓ చీకటి అధ్యాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని రామ్మూర్తినగర్‌లో ఉన్న జిల్లా బీజేపీ కార్యాలయంలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమర్జెన్సీ కాలంలో జైళ్ల పాలైన ఆనాటి జనసంఘ నాయకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, పీ సురేందర్‌రెడ్డి, కే ఆంజనేయరెడ్డి, కందికట్ల రాజేశ్వరమ్మ, జీ భరత్‌కుమార్, యశ్వంత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా బాధిత విద్యార్థులకు పరామర్శ



నెల్లూరు(అర్బన్): గిరిజన వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యాన్ని ఐటీడీఏ పీఓ పట్టించుకోవడం లేదని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య ఆరోపించారు. నెల్లూరులోని జిల్లా సర్వజన వైద్యశాలలో డయేరియాతో చికిత్స పొందుతున్న తిరుపతి జిల్లా గూడూరు రూరల్ మండలం చెన్నూరు ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహ విద్యార్థులను మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చెన్నూరు వసతిగృహంలో బూజుపట్టిన కంది పప్పు, నాసిరకం వస్తువులను వినియోగించడం, రక్షిత నీరు లేకపోవడంతో విద్యార్థులు డయేరియాకు గురయ్యారన్నారు. మూడ్రోజుల క్రితం పది మంది విద్యార్థులు డయేరియా బారినపడగా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. దీంతో సోమవారం రాత్రి మరో 10 మంది డయేరియా బారిన పడ్డారన్నారు. అందుకు సంబంధించి ఐటీడీఏ పీఓపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఘటనకు కారణమైన ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలన్నారు. జిల్లా అధికారులు స్పందించి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని, లేదంటే ఆందోళనలు చేస్తామన్నారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు మురళి, రవీంద్రబాబు, మహిళా అధ్యక్షురాలు ఉష, నాయకులు చంద్రమౌళి,మల్లి ఖార్జున, మల్లి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట



సీపీఎం పాఠశాలను పరిశీలిస్తున్న చిన్నబజారు పోలీసులు

నెల్లూరు సిటీ: నగరంలోని సీపీఎం పాఠశాల అసాంఘిక కార్యక్రమాలకు వేదిక మారిందని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో చిన్నబజారు పోలీసులు అడ్డుకట్టవేసేందుకు చర్యలు తీసుకున్నారు. మంగళవారం చిన్నబజారు పోలీసులు సీపీఎం పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల ఆవరణంలో పగలు, రాత్రి గస్తీని ఏర్పాటు చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు పాల్పడుతున్న ఆకతాయిలకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతామని తెలిపారు. గతంలో పాఠశాలలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. కారణం లేకుండా రాత్రి వేళ తిరిగే ఆకతాయిలు, అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని చిరునామా, ఇతర వివరాలు నమోదు చేయడంతో పాటు వేలిముద్రలు సేకరిస్తామన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే, అనుమానాస్పద, కొత్త వ్యక్తులు కనబడితే టోల్‌ఫ్రీ నంబర్ 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సీపీఎం పాఠశాలను వ్యాయామం వంటి మంచి కార్యక్రమాలకు వినియోగించుకోవాలని స్థానికులకు సూచించారు.

పది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న రూరల్ సీఐ మారుతీకృష్ణ

నెల్లూరు సిటీ: రూరల్ మండలం సౌత్‌మోపూరు ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్స్, అల్లూరి ఆదిశేషయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగదు పురస్కారాలను అందజేశారు. నెల్లూరు రూరల్ సీఐ మారుతీకృష్ణ చేతుల మీదుగా ఉత్తమ మార్కులతో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ,2వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్‌హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్, అల్లూరు ఆదిశేషయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు అల్లూరి మస్తానయ్య, సభ్యులు ఉప్పల ఈశ్వరయ్య, పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నీట్ నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం



మాట్లాడుతున్న డాక్టర్ కాళేషా

నెల్లూరు(వేదాయపాళెం): వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన నీట్ నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నీట్ నిర్వహణ..లీకేజీ..లోపాలు అనే అంశంపై చర్చా వేదికను మంగళవారం నిర్వహించారు. తొలుత చర్చను ఏసీఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాళేషా ప్రారంభించి మాట్లాడారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై దేశవ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర నిరసనలు చేపట్టారన్నారు. అయినా కేంద్రప్రభుత్వం నీట్‌ను రద్దు చేసేందుకు సిద్ధంగా లేదన్నారు. సుప్రీంకోర్టు సైతం కౌన్సిలింగ్‌ను నిలిపేందుకు అంగీకారం తెలపలేదన్నారు. ఈ నేపథ్యంలో నష్టపోయిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఒత్తిడితో కుమిలిపోతున్నారన్నారు. ఇలాంటి తరుణంలో విద్యార్థులకు అండగా ఉండి వారిని మానసికంగా సంసిద్ధంగా చేయాలన్నారు. మళ్లీ నీట్ పరీక్ష రాసేందుకు మోటివేట్ చేయాలన్నారు. భవిష్యత్తులోనైనా ఇలాంటి ఘోర వైఫల్యాలు జరగకుండా కేంద్రం, సుప్రీం కోర్టు చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే అర్హతలేని వైద్యులు సమాజంలోకి వస్తారని, తద్వారా సమాజం తీవ్రంగా నష్టపోతుందన్నారు. విద్య కేంద్రీకృతం కాకుండా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ఎంట్రెన్స్ పరీక్షలు నిర్వహించుకునేలా చేయడమే సరైన విధానం అన్నారు. ప్రభుత్వ నూతన విద్యావిధానాలకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ ఎండీ రఫీ, డాక్టర్ శ్రీనునాయక్, జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్‌భాస్కర్, కృష్ణారెడ్డి, నాయకులు ఎమ్వీ చలపతి, పోతంశెట్టి విద్యాచరణ్, మాదాల రాము, రాజమనోహర్, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి రాజమనోహర్, విద్యార్థి సంఘాల నాయకులు శ్రీజ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశ ప్రతిష్ట



కలశ ప్రతిష్ట నిర్వహిస్తున్న వేదపండితులు

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న మహాలక్ష్మీగోదా సమేత గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో పుష్కర మహాసంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం మహాలక్ష్మికి రక్షా బంధనం, మూలమూర్తికి స్నపన నవకళశ తిరుమంజనం, కలశ ప్రతిష్ట, అష్టోత్తర శతకలశాభిషేకం, తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ద్వారతోరణ, మహాకుంభ, చక్రాబ్జ, మండల ఆరాధన, చతుష్కుండ హోమాలు, పూర్ణాహుతి, మహానివేదన, శాత్తుమొర, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. దేవరాల సుబ్రహ్మణ్యం, మస్తానమ్మ, గడ్డం రత్నయ్య, సుజాత దంపతులు పాల్గొన్నారు. స్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, వెంకటరత్నం, మోహన్‌రావు, కేజీ శంకరన్, తదితరులు పర్యవేక్షించారు.

కళాశాల గుర్తింపును రద్దు చేయాలి

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఒకే క్యాంపస్‌లో ఇంటర్మీడియట్, డిగ్రీ, ఫార్మసీ కోర్సులను నిర్వహిస్తూ పేద విద్యార్థులను ఫీజుల పేరుతో దోచుకుంటున్న శ్రీసాయిలెండి కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మెండా శ్రీహర్ష డిమాండ్ చేశారు. నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజుపాళెంలోని శ్రీసాయి లెండి డిగ్రీ కళాశాలలో ఒకే క్యాంపస్‌లో వేర్వేరు పేర్లతో ఇంటర్మీడియట్, డిగ్రీ, ఫార్మసీ కళాశాలలు నిర్వహిస్తూ ఫీజులను దోపిడీ చేస్తున్నారన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు మంజూరవక ముందే చదివే విద్యార్థులు ఫీజులు కడితేనే పరీక్షలకు పంపించడం, సర్టిఫికెట్లు మంజూరు చేయడం వంటివి చేశారన్నారు. ఇప్పటికైనా విద్యాధికారులు పట్టించుకుని శ్రీసాయి లెండి విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టండి



డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): వర్షాకాలంలో వరద నీరు ప్రవహించేందుకు వీలుగా నగరంలోని ప్రధాన డ్రైనేజీల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. నగరంలోని 14వ డివిజన్ బాలాజీనగర్ ప్రాంతంలో మాజీ కార్పొరేటర్ భువనేశ్వరప్రసాద్ వినతి మేరకు చేపడుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ మంగళవారం పరిశీలించారు. తొలగించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలను వేయకుండా స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, ఇంజినీరింగ్ విభాగం ఈఈ సంజయ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి 'షీ' తోడ్పాటు



అవగాహన కల్పిస్తున్న షీ ప్రతినిధులు

నెల్లూరు(బారకాసు): గ్రామీణ ప్రాంత మహిళ అభివృద్ధికి తోడ్పాటును అందించేందుకు 'షీ' సేవా సంస్థను ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ ఫౌండర్ వికాసిని పేర్కొన్నారు. షీ సేవా సంస్థ ఆధ్వర్యంలో వేదాయపాళెంలో మహిళలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు వర్క్‌షాపును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను మహిళలు, యువతులు ఎదుర్కొంటున్న సమస్యలను చూసి చలించిపోయామన్నారు. మహిళలు ఒకరిపై ఆధారపడకుండా సొంత కాళ్ల మీద నిలబడేలా ఆర్థికాభివృద్ధికి ఏదో రకంగా తనవంతు తోడ్పాటును అందించాలనే లక్ష్యంతో ఒకటిన్నర సంవత్సరం క్రితం అమెరికాలో షీ సేవా సంస్థను ప్రారంభించినట్లు తెలిపారు. అందులో భాగంగా మహిళలకు చేతివృత్తులపై ఉచితంగా శిక్షణ, చిరువ్యాపారాలకు ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. షీ సేవా సంస్థ కార్యకలాపాలను అన్ని ప్రాంతాలకు విస్తరింపజేసేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. అందులో భాగంగానే తొలిసారిగా నెల్లూరులో వర్క్‌షాపును ఏర్పాటు చేసి మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. డాక్టర్ దయాకర్‌రావు మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే సాధించలేనిదేది ఉండదన్నారు. ప్రస్తుతం పరుగులు తీస్తున్న సమాజంతో పాటు మహిళలు పయనించాలని, అందుకు కష్టపడాలన్నారు. సమాజం నాకేం చేసిందని కాకుండా సమాజానికి నేనేం చేసాను అన్న విషయాన్ని గుర్తించిన వికాసిని యూఎస్ఏలో షీ సేవ సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంస్థ ప్రతినిధులు యశోద, తులసీరెడ్డి, విశ్రాంత డీఎస్పీ తోటప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

బొల్లిని ప్రాథమిక దశలో నియంత్రించవచ్చు



డాక్టర్ శ్రీలతారెడ్డికి సత్కారం

నెల్లూరు(అర్బన్): బొల్లిని ప్రాథమిక దశలో గుర్తించి వైద్యం చేయించుకుంటే సమర్థవంతంగా నియంత్రించవచ్చని డాక్టర్ శ్రీలతారెడ్డి తెలిపారు. ప్రపంచ బొల్లి నివారణ దినోత్సవం సందర్భంగా కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బృందావనంలోని శ్రీస్కిన్, హెయిర్ క్లినిక్ మీటింగ్ హాల్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలతారెడ్డి మాట్లాడుతూ బొల్లిపై సమాజంలో ఉన్న అపోహలు, భయాలను ప్రజలు వీడాలన్నారు. చర్మంలో మెలనోసైట్ కణాలు తగ్గడం వల్ల బొల్లి ఏర్పడుతుందన్నారు. బొల్లికి పూత మందులు, ఫొటోథెరపి, సర్జరీలు, మాత్రలు అందుబాటులో ఉన్నాయన్నారు. బొల్లి అంటువ్యాధి కానందువల్ల ఆత్మన్యూనతా భావానికి లోనుకావాల్సిన అవసరం లేదన్నారు. పీఎంపీలు, ఆర్ఎంపీలు బొల్లిపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆమెను పీఎంపీలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, నాయకులు శేషయ్య, ప్రసాద్, రామదాసు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.